సాక్షి
అనకాపల్లి
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం 35 రోజులకు రూ.2.24 కోట్లు వచ్చినట్టు ఈవో తెలిపారు.



3న సంధాయక్ ప్రారంభం

విశాఖ: ఐఎన్ఎస్ సంధాయక్ నౌకను 3న నేవల్ డాక్‌యార్డ్‌లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లాంఛనంగా ప్రారంభిస్తారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

పూర్తి ఆధారాలతోనే ఓట్ల తొలగింపు



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : కచ్చితమైన పూర్తి ఆధారాలు ఉన్నట్లయితేనే ఓట్ల తొలగింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఓట్ల తొలగింపు, నమోదు చేసేందుకు తగిన ఆధారాలు ఉండాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు 99.99 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు వచ్చిన చేర్పులు, అభ్యంతరాలు 23,531లు వాటిలో 13,415 ఆమోదించి, 1,230 తిరస్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 8,886 అర్జీలలో 7,087 అర్జీలు వివిధ దశల్లో ఉండగా 1752 అర్జీలను పరిశీలించవలసి ఉందన్నారు. ప్రస్తుతం ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి శ్రీనివాసరావు, కె.హరినాథ్ బాబు, పి.నాగేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మిదేవి, డీటీ రవికుమార్, ఎస్ఏ తులసి రామ్ పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా శ్రీనివాసరావు

తుమ్మపాల: జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీగా యల్లంపల్లి శ్రీనివాస్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అచ్యుతాపురం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి గృహ నిర్మాణ శాఖ పీడీగా బదిలీ చేశారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో చరీష్‌కు బంగారు పతకం



పతకం సాధించిన చరీష్

మునగపాక: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో మునగపాకకు చెందిన దాడి దీప్ చరీష్ బంగారు పతకం గెలుచుకున్నాడు. మునగపాకకు చెందిన పెంటకోట వెంకట్–జానకీ శ్రీదేవి దంపతుల మనవడు దాడి దీర్ చరీష్ కోయంబత్తూర్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఈ ఘనత సాధించాడు. చరీష్ ఇటీవల రాష్ట్ర స్థాయిలో తిరుపతిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నాడు. జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించిన చరీష్ అక్కడ కూడా తన ప్రతిభను ప్రదర్శించాడు.

రెండో టెస్ట్‌కు భారీ ఏర్పాట్లు

- ఇంగ్లండ్ అభిమానులకు ప్రత్యేక భద్రత
- మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ
- విద్యార్థులకు ఉచిత ప్రవేశం

8లో

మెగా డీఎస్సీ జోష్

- టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- క్యాబినెట్ ఆమోదంతో సర్వత్రా చర్చ
- క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు



పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

విశాఖ విద్య: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మెగా డీఎస్సీ నిర్వహణకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. విద్యాశాఖ వర్గాలు, నిరుద్యోగ అభ్యర్థుల్లో బుధవారం దీనిపై సర్వత్రా చర్చ సాగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ వస్తోందని నిరుద్యోగ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెగా డీఎస్సీలో జిల్లాల వారీగా ఎన్ని పోస్టులు ఉన్నాయి. వీటిలో క్యాడర్ వారీగా ఎన్ని ఉన్నాయనే దానిపై అభ్యర్థులు ఆరా తీశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన నియామకాల ప్రక్రియ ఉండటంతో ఉపాధ్యాయ కొలువు దక్కించుకునేందుకు అభ్యర్థులు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, గిరిజన సంక్షేమశాఖ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీలో ఖాళీలను గుర్తించారు.

పట్టుదలతో సిద్ధమవుతున్నా..



డీఎడ్ పూర్తి చేశాను. డీఎస్సీ ప్రిపరేషన్ కోసమని నర్సీపట్నం ప్రాంతం నుంచి నా భర్తతో కలసి విశాఖ నగరానికి వచ్చాం. ఎలాగైనా డీఎస్సీలో పోస్టు దక్కించుకోవాలనే పట్టుదలతో సిద్ధమవుతున్నాను. అనుకున్నట్లుగానే మెగా డీఎస్సీకి ప్రభుత్వం ఆమోదించటం సంతోషంగా ఉంది.

– సింగంపల్లి వెంకట లక్ష్మి, కల్యాణలోవ, అనకాపల్లి జిల్లా

కాలేజీలకు క్రేజ్ పెరుగుతుంది



డీఎస్సీ నోటిఫికేషన్లు తరచూ ఉంటే, బీఈడీ, డీఎడ్ శిక్షణా కళాశాలలకు ఆదరణ ఉంటుంది. ఈ ప్రభుత్వ హయాంలో తప్పనిసరిగా మెగా డీఎస్సీ ఉంటుందని అంతా ఊహించినదే. నిరుద్యోగ అభ్యర్థులు కూడా అదే నమ్మకంతో ప్రిపరేషన్‌లో ఉన్నారు. మొత్తానికి అంతా శుభసూచికమే.

– గొట్టేట రవి, సీనియర్ ఫ్యాకల్టీ, ప్రభుత్వ డైట్ కాలేజీ, భీమునిపట్నం

సీఎం అన్న మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నట్లుగానే డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తారు. దీని వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులపై కూడా భారం తగ్గుతుంది. నోటిఫికేషన్ నాటికి ఇంకాస్తా పోస్టులు పెరుగుతాయనే నమ్మకం ఉంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

తహసీల్దార్ల బదిలీ

మహారాణిపేట (విశాఖ): సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి విశాఖ జిల్లాలో 58 మంది తహసీల్దార్లకు స్థాన చలనం కలిగింది. వీరిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ) జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 30లోపు రిటైర్ అవుతున్న మాడుగుల తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ, అనకాపల్లి జిల్లా మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.ఎ.శ్రీనివాస్, అనకాపల్లి తహసీల్దార్ పీవీఎల్ఎన్ గంగాధర్, సబ్బవరం తహసీల్దార్ బి.సత్యనారాయణ, మునగపాక తహసీల్దార్ వి.ప్రకాశరావులకు బదిలీ కాలేదు. జిల్లాలో మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి కాని మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనందకుమార్, గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లికి బదిలీ కాలేదు.

అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ ఏవో ఎ.శ్రీనివాసరావును విజయనగరం జిల్లాకు, అనకాపల్లి జిల్లా తహసీల్దార్ పి.లక్ష్మిదేవి శ్రీకాకుళం జిల్లాకు, అనకాపల్లి తహసీల్దార్ ఆర్.నరసింహమూర్తిని శ్రీకాకుళం జిల్లాకు, అనకాపల్లి ఆర్డీవో ఆఫీసు ఏవో సిహెచ్ చంద్రశేఖరరావును విజయనగరం జిల్లాకు, బుచ్చెయ్యపేట తహసీల్దార్ పి.శ్రీనివాసరావును పార్వతీపురం మన్యం జిల్లాకు, చోడవరం తహసీల్దార్ ఎల్.తిరుమలబాబును శ్రీకాకుళం జిల్లాకు, దేవరాపల్లి తహసీల్దార్ ఎం.లక్ష్మిని శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. యలమంచిలి తహసీల్దార్ ఎస్.రాణీ అమ్మాజీ, కె.కోటపాడు జె.రమేష్‌బాబు, కశింకోట జి.సత్యనారాయణ, పరవాడ పి.కనకరావు, రాంబిల్లి పి.భాగ్యవతి, నర్సీపట్నం ఆర్డీవో ఆఫీసు సూపరింటెండెంట్ జె.సూర్యనారాయణ, చీడికాడ తహసీల్దార్ బి.వి.రాణిలను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. గొలుగొండ తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాదరావు, కోటవురట్ల కె.జానకమ్మ, మాకవరపాలెం ఎంవీవీ ప్రసాద్, నక్కపల్లి ఎస్.వి.అంబేద్కర్, నాతవరం తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడులకు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యింది. పాయకరావుపేట తహసీల్దార్ కె.జయప్రకాష్, రావికమతం ఎస్.ఎ.మహేశ్వరరావు, రోలుగుంట వరహాలులను పార్వతీపురం మన్యం జిల్లాకు, ఎస్.రాయవరం తహసీల్దార్ కె.విజయకుమార్‌ను శ్రీకాకుళం జిల్లాకు, వి.మాడుగుల తహసీల్దార్ పి.వి.రత్నం విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు.

నేరాలు ఛేదించేందుకు పోలీసు జాగిలాలు

- డాగ్స్ కెన్నెల్‌ను ప్రారంభించిన ఎస్పీ మురళీకృష్ణ



పోలీసు జాగిలాలతో ఎస్పీ మురళీకృష్ణ, ఇతర పోలీసు అధికారులు

నర్సీపట్నం: నర్సీపట్నం ఓఎస్‌డీ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించిన డాగ్స్ కెన్నెల్‌ను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కెన్నెల్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలు ఉంటాయన్నారు. లేబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన రీటా, బన్నీలకు గంజాయి, మాదకద్రవ్యాలను గుర్తించేలా ఏడాదిపాటు విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. రీటా హ్యాండ్లర్‌గా ఆర్మ్ రిజర్వ్ కానిస్టేబుల్ వి.సింహాచలం, బన్నీ హ్యాండ్లర్‌గా ఆర్మ్ రిజర్వ్ కానిస్టేబుల్ డి.ఎస్.నాయుడు వ్యవహరిస్తారన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలను గుర్తించేందుకు వీలుగా జాగిలాలను తయారు చేశామన్నారు. జిల్లాలో గంజాయి రవాణా అరికట్టేందుకు రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, వివిధ చెక్‌పోస్టుల వద్ద వాహనాలు, లగేజ్ బ్యాగులను తనిఖీ చేసేందుకు జాగిలాలను వినియోగిస్తామన్నారు. నేరాలను ఛేదించేందుకు జాగిలాల సేవలు వినియోగించుకుంటామన్నారు. ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ రావు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు ఎన్.గణేష్, హరి, రామకృష్ణారావు, సతీష్ పాల్గొన్నారు.

గొలుగొండ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

గొలుగొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మురళీకృష్ణ, నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఇక్కడ రెండు కోట్లతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ పనులు పరిశీలించారు. ఈ పోలీస్‌స్టేషన్ ప్రారంభానికి రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. రూరల్ సీఐ హరి, ఎస్ఐలు కృష్ణారావు, ఉపేంద్ర, భీమరాజు పాల్గొన్నారు.

భారీగా డీఎస్పీల బదిలీలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీలు భారీగా బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. విశాఖ రేంజ్ పరిధిలో అనకాపల్లి డీటీసీ డీఎస్పీగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావును బొబ్బిలి ఎస్‌డీపీఓగా, అనకాపల్లి దిశా డీఎస్పీ ఎం.మహేశ్వరరావును అమలాపురం ఎస్‌డీపీఓగా, రాజమండ్రి ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న డి.రామవర్మను అనకాపల్లి డీటీసీ డీఎస్పీగా బదిలీ చేశారు. అదేవిధంగా శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీగా ఉన్న సీహెచ్‌జీవీ ప్రసాదరావును విశాఖ సిటీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, శ్రీకాకుళం ఎస్బీ డీఎస్పీగా ఉన్న కె.బాలరాజును విశాఖ మెరైన్ డీఎస్పీగా, రామచంద్రాపురం ఎస్‌డీపీఓగా పనిచేస్తున్న టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను విశాఖ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.రాంబాబును ద్వారకా ఏసీపీగా, కాకినాడ దిశా డీఎస్పీగా పనిచేస్తున్న బి.ఎం.జయరాం ప్రసాద్‌ను విశాఖ సిటీ ఈస్ట్ ఏసీపీగా, కృష్ణా జిల్లా సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న సీహెచ్ మురళీకృష్ణను విశాఖ సిటీ నార్త్ ఏసీపీగా, ఎన్టీఆర్ సీటీసీ ఏసీపీగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును విశాఖ సిటీ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు



క్రీడాకారులతో జేసీ జాహ్నవి



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

- సన్మార్గంలో యువత.. స్పోర్ట్స్ కోటాలో ఉపాధి అవకాశాలు
- ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో జేసీ జాహ్నవి

అనకాపల్లి: యువత పెడతోవ పట్టకుండా ఉండేందుకు ఆడుదాం– ఆంధ్రా క్రీడలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం ఆమె జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చెడు వ్యసనాల కారణంగా యువత బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. ఇటీవల గ్రామీణస్థాయి నుంచి ప్రారంభమైన ఈ క్రీడలు యువతను సరైన మార్గంలో నడిపించడమే కాకుండా వారి బంగారు భవిష్యత్‌కు నాంది పలుకుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతోపాటు క్రీడా కోటా ద్వారా ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించవచ్చని, పైకి రావచ్చని పేర్కొన్నారు.

ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఖోఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు ఫిబ్రవరి 5 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార అధికారి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలు
- పర్యావరణ ప్రణాళికపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : జిల్లాలో ఎటువంటి కాలుష్యాలు లేకుండా కాలుష్య రహిత జిల్లాగా రూపొందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యావరణ ప్రణాళికపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘన, ద్రవ, విద్యుత్ సాంకేతిక వ్యర్థాలతో పాటు ప్రమాదకర వ్యర్థాల నిర్వహణకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీరు, ధ్వని కాలుష్యాలను సైతం మోతాదు దాటకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలుష్యాన్ని తగ్గించి పారదోలే మొక్కలు నాటే కార్యక్రమాలు పారిశ్రామిక ప్రాంతంలోనే కాకుండా అన్ని పట్టణాలు, గ్రామాల్లో చేపట్టాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాల ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టాలని, జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలను అనుసరించి ప్రణాళిక ఉండాలని సూచించారు. అనకాపల్లి జోనల్ జీవీఎంసీ, యలమంచిలి, నర్సీపట్టణం పురపాలక సంఘాల్లో సమీకరించిన 450 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను, గ్రామాల్లో వ్యర్థాలను కూడా సేకరించి జిందాల్ ప్లాంట్‌కు పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణపై మేజర్ పంచాయతీల్లో వర్క్‌షాపులు నిర్వహించాలని, గ్రామాల్లో పాలకులు, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు లేబొరేటరీలకు చెందిన బయో మెడికల్ వ్యర్థాలను, ఎలక్ట్రిక్ వ్యర్థాల(ఈ–వేస్ట్) నిర్వహణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వివిధ రకాల రసాయన చెడు వాసనలను తగ్గించే మొక్కలు, చెట్లను ఆయా ప్రాంతాల్లో నాటే ఏర్పాట్లు చేయాలని అన్నారు. నీటి కాలుష్యంపై అప్రమత్తతతో ఉండాలని మున్సిపల్, పంచాయతీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక వ్యర్థాలు, స్టోన్ క్రషర్ల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించేందుకు సామాజిక అడవుల పెంపకం వంటి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.ఎం. శ్రీధర్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా నీటిపారుదల ఈఈ ఎ.త్రినాథం, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఈఈ వీరునాయుడు, ఏపీఐఐసీ డిప్యూటీ జెడ్ఎం ఎ.కిషోర్, డీపీవో ఆర్.శిరీషరాణి డీఎస్‌వో కేవీఎల్ఎన్ మూర్తి, డీఎఫ్ఓ జి.లక్ష్మణ్ డి.ఎస్.పి ఏడీ మైన్స్ టి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

ప్రగతి పండగ

- కె.కోటపాడులో రూ.16 కోట్లతో 18 అభివృద్ధి పనులు
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

నాడు.. పల్లెలు నిర్లక్ష్యానికి **ఆనవాళ్లు.** వెనుకబాటుకు చిరునా**మాలు. అభివృద్ధి** అంతా పట్టణ ప్రాంతాలకే **పరిమితమై** వెలవెలబోయేవి.

నేడు.. గ్రామాలకే **అగ్రతాంబూలం.** ఊరు బాగుపడితేనే దేశం **ప్రగతి సాధిస్తుం**దన్న నమ్మకం. ఆ ఆశ**యంతోనే ముందుకు** సాగుతున్న ప్రభుత్వం.

ఊరు.. సెలయేరు.. **కళకళలాడుతు**న్నాయి. పొలాలు పచ్చ**గా ఉన్నాయి. అన్న**దాత ఆనందంగా ఉన్నా**డు. ఐదేళ్లలోనే** కనీవినీ ఎరగని ప్రగతి **పల్లెల గతిని మార్చిం**ది. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. అందుకు కె.కోటపాడులో గురువారం ప్రారంభం కానున్న అభివృద్ధి పథకాలే ఉదాహరణ.



జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మాణం జరిగిన మంచినీటి ట్యాంక్

కె.కోటపాడు: రోడ్లు, డ్రెయినేజీలు, పక్కా భవనాలతో ఆస్పత్రి, సచివాలయం, మంచినీటి ట్యాంక్.. కొత్తగా జరిగిన ఈ అభివృద్ధి పనులన్నీ ఒకేసారి అందుబాటులోకి వస్తే అంతకన్నా సంతోషం ఇంకేముంటుంది. అందుకే కె.కోటపాడులో పండగ చేసుకుంటున్నారు. సుమారు రూ.16 కోట్లతో చేపట్టిన 18 అభివృద్ధి పనులను గురు, శుక్రవారాల్లో ప్రారంభించనున్న నేపథ్యంలో సర్వత్రా ఆనందకర వాతావరణం కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడంతో పల్లెల రూపురేఖలు మారాయి. తన నియోజకవర్గం నంబర్ వన్‌గా ఉండాలన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తపన మాడుగుల నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. కొత్తగా ప్రారంభించనున్న పనులతో కె.కోటపాడులో కొత్త కళ తాండవించనుంది. గ్రామంలో గల డ్రెయినేజీ సమస్యను గత తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలను మురుగు సమస్య తీవ్రంగా వేధించింది. దీంతో స్థానిక ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ గ్రామంలో ప్రధాన వీధుల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లను డిప్యూటీ సీఎం సహకారంతో రూ.2 కోట్ల 32 లక్షలతో నిర్మించారు. దీంతో ప్రస్తుతం హాస్పటల్ నుంచి బంక్ వరకు డ్రెయినేజీ, రావాలమ్మ అర్చి నుంచి మేడపురెడ్డి కళ్ళాల వరకు, సరాబు పేటలో చిన్నవీధి, పెద్దవీధి, దిగువ యాతపేట, గొల్లపేట, రెల్లిపేటలలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు పూర్తయ్యాయి. వీటితోపాటు గ్రామంలో విశ్వ బ్రాహ్మణులకు, ఎగువ గొల్లపేట యాదవ సంఘానికి, జంగాల కాలనీలో సామాజిక భవనాలను నిర్మాణం జరిపారు. వీటితో పాటు ఎగువ యాతపేటలో శెట్టిబలిజలకు సామాజిక భవనం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.



కె.కోటపాడు-కింతాడ గ్రామాల మధ్య నిర్మించిన తారురోడ్డు

గ్రామాన్ని కలిపే మట్టిరోడ్లు తారురోడ్లుగా..

కె.కోటపాడు నుంచి రెల్లిపేట మీదుగా కింతాడ వరకు, కె.కోటపాడు జంగాల కాలనీ నుంచి మేడిచర్ల వరకు గల మట్టిరోడ్లను రూ.2 కోట్లతో తారురోడ్లుగా అభివృద్ధి చేశారు. వీటితో పాటు గ్రామస్తులకు శాశ్వతంగా మంచినీటి సమస్యను తీర్చేందుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.3 కోట్ల 50 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులను కేటాయించారు. దీంతో మంచినీటి పథకంతో పాటు ఇంటింటి కుళాయిల నిర్మాణాలను పూర్తి చేశారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీసీ రోడ్డు

కె.కోటపాడు హైస్కూల్‌లో రూ.67 లక్షలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సీఎం జగన్ కె.కోటపాడు మీదుగా పాదయాత్రను నిర్వహించిన సమయంలో కె.కోటపాడు సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పూర్తి మౌలిక వసతులను కల్పించనున్నట్లు ప్రకటించారు. అన్నమాట ప్రకారం కె.కోటపాడు సీహెచ్‌సీ స్థాయిని 50 పడకలకు పెంచడంతో పాటు ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.5 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టిన పనులు పూర్తవడంతో వీటన్నింటినీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా గురువారం ప్రారంభించేందుకు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



అదనపు భవనాల నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న సీహెచ్‌సీ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయం

- రూ.5.6 కోట్లతో సీహెచ్‌సీలో అదనపు భవనాలు, సమకూరిన మౌలిక వసతులు
- రూ.3.5 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు
- రూ.2.32 కోట్లతో గ్రామంలో పలు వీధుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- రూ.2 కోట్లతో కె.కోటపాడు-కింతాడ, కె.కోటపాడు- మేడిచర్ల రోడ్డు వరకు రెండు తారురోడ్లు

ఊహించని అభివృద్ధి



కె.కోటపాడు గ్రామంలో సీఎం జగన్ పాలనలో అభివృద్ధి శరవేగంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గ్రామంలోని అన్ని వీధుల్లోను సమానంగా అభివృద్ధి జరిగింది. గతంలో మట్టి రోడ్లు, మురుగుతో ఉన్న నివాస ప్రాంతాలు ప్రస్తుతం సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలతో సౌకర్యంగా ఉన్నాయి.

–భర్ల రాము, కె.కోటపాడు

డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు



గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వచ్చింది. రూ.5 కోట్ల 60 లక్షలతో ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో పాటు కోట్లాది రూపాయల నాడు–నేడు నిధులతో హైస్కూల్, కళాశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యం కల్పించినందుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

–మేడపురెడ్డి లక్ష్మి, కె.కోటపాడు

క్లుప్తంగా

ఒత్తిడి వద్దు.. విజయం మీదే

- టెన్త్ విద్యార్థులతో డీఈవో మాటామంతీ



కొత్తకోట హైస్కూల్లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మహాలక్ష్మమ్మ

రావికమతం: పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఇష్టపడి పరీక్షలు రాయాలని, జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక కావాలని జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ అన్నారు. కొత్తకోట, పి.పొన్నవోలు ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ముందుగా కొత్తకోట హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల గదికి వెళ్లి బాగా చదువుతున్నారా, అన్నీ అర్థమవుతున్నాయా అని.. అడిగి తెలుసుకున్నారు. మీరు తరగతి గదిలో చదివినవే పరీక్షలో వస్తాయని, ఒత్తిడి పడవద్దన్నారు. ఆ హైస్కూల్లో వెనుకబడిన విద్యార్థులు 22 మంది ఉన్నట్టు తెలుసుకుని వారికి ప్రతి రోజూ ఒక గంట అదనపు సమయాన్ని కేటాయించాలని ఆదేశించారు. రక్తహీనత లోపించిన విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్నదీ లేనిదీ వారినే అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు

విద్యార్థులకు సూచనలిచ్చిన తర్వాత డీఈవో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అక్కడ తగిన సదుపాయాలు ఉన్నాయో లేదో చూశారు. కిటికీలు, వెలుతురు సదుపాయాన్ని పరిశీలించారు. దివ్యాంగులు బూత్ వరకు నేరుగా చక్రాల బండిపై వెళ్లేందుకు వీలుగా ర్యాంప్‌లను సిద్ధం చేయాలని, కొన్ని చోట్ల శిథిలమై ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాలని ఆమె ఆదేశాలిచ్చారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న కోదండరామిరెడ్డి

అనకాపల్లి: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వసతులు సమకూర్చేందుకు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం చర్యలు చేపడుతుందని వర్సిటీ బోర్డు మెంబర్ డాక్టర్ డి.కోదండరామిరెడ్డి అన్నారు. పరిశోధన స్థానాన్ని బుధవారం ఆయనతోపాటు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు చింతా ఈశ్వరరావు, పి.గురుమూర్తి, సాయిలక్ష్మి సందర్శించారు. చెరకు పరిశోధనల్లో 110 ఏళ్ల చరిత్ర కలిగిన వ్యవసాయ పరిశోధన స్థానంలో వసతులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిన ప్రీమియర్ ట్రైనింగ్ సెంటర్, అంతర్గత రహదారులు, గెస్ట్‌హౌస్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. రైతుల అభ్యున్నతికి శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. ముందుగా ఏడీఆర్ కె.వి.రమణమూర్తి, శాస్త్రవేత్తలు వారిని ఘనంగా సత్కరించారు. పి.వి.కె.జగన్నాథరావు, శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్షి, రామలక్ష్మి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

- 'చోడవరం'లో రూ.3,280 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్, ఆర్బీకేల ప్రారంభం



పెదమదీనలో హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నాయకులు



శివరాంపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చెయ్యపేట మండలం పెదమదీనలో గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, ఆర్.శివరాంపురంలో సచివాలయం, గొర్లెపాలెంలో రైతు భరోసా కేంద్రం, మల్లాంలో గ్రామ సచివాలయ భవనాలను బుధవారం మండల, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల్లో మౌలిక, అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నారన్నారు. చోడవరం నియోజకవర్గంలో నాలుగున్నరేళ్ల కాలంలోనే అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3,280 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గతంలో పింఛన్, రేషన్ కార్డు, విత్తనాలు, వైద్య సేవల కోసం దూర ప్రాంతాల్లోని మండల కేంద్రాలకు వ్యయ ప్రయాసాలు పడి వెళ్లే పరిస్థితులుండేవని.. నేడు జగనన్న ఈ సమస్యలేవీ లేకుండా చేశారన్నారు. ఉన్న గ్రామంలోనే అన్ని సేవలు అందేలా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని చెప్పారు. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందన్నారు. అన్ని గ్రామాల్లో రోడ్ల ఏర్పాటుతోపాటు పెద్దేరు, పెదపూడి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ సాగు నీరు అందేలా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ సెల్ సెక్రటరీ కె.అచ్చింనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్‌లు కె.వి.ఆర్.ధనలక్ష్మి, నమ్మి నీరజ అప్పలరాజు, బర్ల శివ, ఇందలి కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాము, డీపీవో శిరీషారాణి, జేఈ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వైఎస్సార్ తీర్థం



ఏఎస్‌పేటలో జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రధానంగా అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గ గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరిగింది. పిల్లల ఆట వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. ఫోం జారుడు బల్లలపై పిల్లలు ఉత్సాహంగా జారుతూ ఆనందంగా గడిపారు. ఆకాశ చక్రంపై పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఉత్సాహంగా తిరుగాడారు. ఉత్సవంలో మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. బుర్రకథ, టీవీ కళాకారులతో నిర్వహించిన



ఆకాశ చక్రంపై తిరుగాడుతున్న యువతీ యువకులు

డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి ఆహూతులను అలరించాయి. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గుర్రం పరుగు పోటీలు

వైఎస్సార్ తీర్థంలో నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీల్లో అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన చోడమాంబిక విక్రం గుర్రం ప్రథమ బహుమతిని గెలుచుకుంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. చోడవరానికి చెందిన దాడి నూక హనుమంతరావు గుర్రం ద్వితీయ, సింగపూర్ సత్యనారాయణకు చెందిన గుర్రం తృతీయ, ఆయనకే చెందిన మరో గుర్రం చతుర్థ బహుమతులను గెలుచుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్‌తో కలిసి భరత్ కుమార్ అందజేశారు. సుమారు 15 గుర్రాలు పోటీలో పాల్గొన్నాయి. సీఐ ఎం.వినోద్‌బాబు తమ సిబ్బందితో పోటీలను పర్యవేక్షించారు.

నేడు ఆడారి తులసీరావు తీర్థ మహోత్సవం

- తులసీరావు ఘాట్ వద్ద భారీ ఏర్పాట్లు
- 10 వేల మందికి అన్నసమారాధన
- ఘాట్ వద్ద ఆంధ్రా కురియన్ కాంస్య విగ్రహావిష్కరణ
- పెద్ద ఎత్తున తరలిరానున్న అభిమానులు



తులసీరావు ఘాట్ వద్ద ఏర్పాట్లు

యలమంచిలి: ఆంధ్రా కురియన్, పాడి రైతుల పాలిట పెన్నిధి, రైతు బాంధవుడు, దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మొదటి తీర్థ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. తులసీరావు మొదటి సంస్మరణ సభను పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహావిష్కరణను కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య వేడుకగా నిర్వహించనున్నట్లు విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సంయుక్త ప్రకటనలో తెలిపారు. యలమంచిలి మున్సిపాలిటీ పెండిపాలెం, తులసీరావు ఘాట్ వద్ద కాంస్య విగ్రహాన్ని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఘాట్ వద్ద మధ్యాహ్నం 10 వేల మందికి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తీర్థం సందర్భంగా ఎడ్ల పందేలు, చిడతలు, 10 బృందాలతో మహిళల కోలాటం, 3 తాడిపెద్దు సాముగరిడీలు, కోయ డ్యాన్స్‌లు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, చిటికెల భజనలు మొదలగు సాంస్కృతిక ప్రదర్శనలు, భారీ మందుగుండు, లైటింగ్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి తులసీరావు అభిమానులు తరలిరానున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి వెంకట్, ఆడారి శ్రీధర్(చిన్నా), నాయుడు, సుందరపు బాబ్జి తెలిపారు. తులసీరావు ఘాట్ వద్ద భారీ పెండాల్స్, బారికేడ్లు, తులసీరావు హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.

రెండో టెస్ట్‌కు భారీ ఏర్పాట్లు

- ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ముచ్చటగా మూడో టెస్ట్ మ్యాచ్.. ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లండ్ జట్టు టెస్ట్ మ్యాచ్ ఆడగా.. మరోసారి ఆడేందుకు ఆ దేశ జట్టు వచ్చింది. ఆతిథ్య జట్టుకు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన ఈ స్టేడియంలో 2016లో ఇంగ్లండ్‌తో, 2019లో దక్షిణాఫ్రికాతో ఆడి విజయాలను సొంతం చేసుకుంది. ఆయా సిరీస్‌ల్లో తొలి విజయాలతో చక్కటి ఆరంభాన్ని వైఎస్సార్ స్టేడియం ఇచ్చింది. కాగా.. ఇంగ్లండ్ మ్యాచ్ అనగానే ఆ దేశం నుంచి మ్యాచ్‌ను తిలకించేందుకు భారీగా అభిమానులు తరలి వస్తున్నారు. టూ టైర్ సిటింగ్ ఏర్పాట్లు ఉన్న స్టేడియంలో సౌత్, నార్త్ బ్లాక్‌ల్లో అభిమానులకు అనుమతిస్తున్నారు. విద్యార్థులు, క్రికెట్ క్లబ్‌ల తరఫున ఆడే ఔత్సాహికులకు ఏసీఏ ఉచితంగానే టికెట్లను అందించే ఏర్పాట్లు చేసింది. ఇంగ్లండ్ అభిమానుల భద్రత, మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లు, టికెట్ల విక్రయాలు తదితర అంశాలను ఎస్‌ఆర్ గోపీనాథ్‌రెడ్డి బుధవారం ‘సాక్షి’కి వివరించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇంగ్లండ్ అభిమానులకు ప్రత్యేక భద్రత

వైఎస్సార్ స్టేడియంలో రెండో టెస్ట్ మ్యాచ్ వీక్షించేందుకు ఇంగ్లండ్ అభిమానులు ఏకంగా మూడు బాక్స్‌ల టికెట్లను కొనుగోలు చేశారు. వారి భద్రతకు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్, నగర పోలీస్ కమిషనర్ రెక్కీ నిర్వహించి ఏర్పాట్లు సమీక్షించనున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో హోటళ్లను బుక్ చేసుకున్నారు. ఇక స్టేడియంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఎండను తట్టుకునేందుకు వీలుగా సన్‌స్క్రీన్ లోషన్‌ను వారి వెంట తెచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించాం.

మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

స్టేడియంలో కొత్తగా కమోడ్‌లు ఏర్పాటు చేశాం. డ్రైనేజీను ఆధునీకరించాం. మ్యాచ్ జరిగేప్పుడు పారిశుధ్య నిర్వహణ కోసం బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థకు అప్పగించాం. ఇందుకోసం ఓ అప్లికేషన్ రూపొందించాం. స్టేడియంలో ఎప్పుడు, ఎక్కడ ఎలాంటి పరిశుభ్రత జరుగుతుందనే విషయాన్ని పర్యవేక్షిస్తాం. మ్యాట్స్, టైల్స్ తదితరాలను శుభ్రంగా ఉంచే ఏర్పాట్లు జరిగాయి.

ఫోన్‌లో టికెట్ చూపిస్తే చాలు

దేశంలోనే తొలిసారిగా డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. కొనుగోలు చేసిన టికెట్‌ను ఫోన్‌లో చూపించి ప్రవేశం పొందవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు టికెట్ కోసం స్టేడియానికి రావాల్సిన అవసరం లేదు. లైన్‌లో వేచి ఉండక్కర్లేదు. దీనివల్ల పేపర్‌ను సేవ్ చేయవచ్చు. ఇటీవల జరిగిన టీ-20 మ్యాచ్‌కు ఈ విధానాన్ని అమలు చేద్దామని భావించాం. అయితే ట్రయల్‌రన్ నిర్వహిస్తే బాగుంటుందని ఇప్పుడు అమలు చేస్తున్నాం. లోటుపాట్లు ఉంటే సవరించుకుని.. సక్సెస్ అయితే ఇక డిజిటల్ టికెటింగ్‌కే ప్రాధాన్యమిస్తాం.

విద్యార్థులకు ఉచిత ప్రవేశం

ఐదు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రతి రోజూ రెండు వేల మంది విద్యార్థులను ఉచితంగానే స్టేడియంలోకి అనుమతిస్తాం. అయితే విద్యార్థులు విద్యా సంస్థ ధ్రువీకరణతో రావాల్సి ఉంటుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే రావాలని లేదు. కాకుంటే నిర్ణయించిన సంఖ్య వరకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని సంఘ అనుబంధ క్లబ్‌లకు సంబంధించి ప్రతి రోజూ 2,850 మంది ఔత్సాహిక క్రికెటర్లకు ప్రవేశం కల్పించడానికి ఏర్పాట్లు చేశాం.

20 వేల టికెట్ల విక్రయం

టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో 15 వేల టికెట్లు, కౌంటర్ల ద్వారా 5వేల టికెట్లు అమ్ముడుపోయాయి. స్టేడియం వద్ద ఆట చివరి రోజు వరకు కౌంటర్ ద్వారా టికెట్లను విక్రయించనున్నాం. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో అభిమానులు రావచ్చని అంచనా వేస్తున్నాం. అభిమానులు తమ వాహనాలను కల్యాణ్‌కుమార్ పార్కింగ్ లేఅవుట్, బీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి. ఉచితంగా మంచినీటిని అందిస్తాం. స్టేడియంలో ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉంటాయి. స్టేడియంలోకి ఎలాంటి తినుబండారాలను అనుతించం. ఉదయం ఎనిమిది నుంచే స్టేడియంలోకి అనుమతిస్తాం. రోజుకు టికెట్ ధర కనీసం రూ.100 నుంచి గరిష్ఠ ధర రూ.500గా నిర్ణయించినట్లు గోపీనాథ్‌రెడ్డి వివరించారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం



చలపతిరావు దంపతులను సన్మానిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, వీసం రామకృష్ణ

నక్కపల్లి: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉందని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. బంగారయ్యపేట యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నల్లల చలపతిరావు పదవీ విరమణ సందర్భంగా బుధవారం గ్రామస్తులు నిర్వహించిన పౌరసన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యా వ్యవస్థలో వస్తున్న సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. చలపతిరావు శేషజీవితం ప్రశాంతంగా సాగాలని కోరుకుంటూ అభినందనలు తెలిపారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన నాడు-నేడు పనులను ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహించి పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారన్నారు. తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చారన్నారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు జగనన్న ప్రభుత్వం ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. చలపతిరావు మాస్టర్ దాదాపు 30 ఏళ్ల పాటు నక్కపల్లి మండలంలోనే ఉపాధ్యాయుడిగా సేవలందించడం గర్వంగా ఉందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, యూటీఎఫ్ పూర్వ నాయకులు రాయి రమేష్‌బాబు, డీవైఈవో అప్పారావు, ఎంఈవో కుంచం నరేష్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, నూకరాజు తదితరులు మాట్లాడుతూ చలపతిరావు ఎంతో నిబద్ధతతో పనిచేసి అధికారులు, రాజకీయ నాయకులు, గ్రామస్తుల మన్ననలు పొందారన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు దంపతులను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్‌లు అయినంపూడి చినపేర్రాజు, నాగమణి, ఎంపీటీసీలు నిట్ల గోవిందు, వైబోయిన రమణ, ఉపాధ్యాయులు సన్యాసిరావు, టి.వి.రమణ, శివాజీ, నల్లల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెస్ చెల్లింపునకు వర్తకులు సహకరించాలి



మాట్లాడుతున్న మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు

మాడుగుల రూరల్: గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి సెస్ చెల్లింపునకు వర్తకులు సహకరించాలని మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు కోరారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం వర్తకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట తదితర గిరిజన మండలాల్లో పసుపు, చిక్కుళ్లను వర్తకులు కొనుగోలు చేస్తున్నారని, దీనికి సంబంధించి పాడేరు మార్కెట్ కమిటీకి నామమాత్రపు సెస్(25 శాతం) చెల్లిస్తుండగా.. మిగిలిన 75 శాతం సెస్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన మాడుగుల మార్కెట్ కమిటీకి చెల్లించాలని తెలిపారు. మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.బంగార్రాజు మాట్లాడుతు సెస్ చెల్లించడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునన్నారు.

నూతన కార్యాలయానికి రూ.50 లక్షల మంజూరు

కొత్తగా ఏర్పాటు చేసిన మాడుగుల మార్కెట్ కమిటీ నూతన కార్యాలయానికి రూ.50 లక్షల మంజూరు చేశారని, కార్యాలయ ప్రహరీ నిర్మాణానికి అదనంగా మరో రూ.15 లక్షలను మార్కెట్ కమిటీ సేవింగ్స్ ఖాతా నుంచి మంజూరు చేశారని చైర్మన్ శానాపతి కొండలరావు తెలిపారు. మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ తరఫున డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు, డైరెక్టర్లు నూతిగట్టు గౌరీశంకర్, బసవ రామపరమేశ్వరావు, స్థానిక చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కరణం వెంకటేశ్, మాడుగుల, ఎం.కోడూరు తదితర గ్రామాలుకు చెందిన వర్తకులు, కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు నియామక ఉత్తర్వుల అందజేత




చోడవరం ఎంపీడీవోగా నియమితులైన రమామణికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

మహారాణిపేట(విశాఖ): ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏడుగురు ఎంపీడీవోలకు బుధవారం జిల్లా పరిషత్ సీఈవో పి.పోలినాయుడు నియామక ఉత్తర్వులు అందజేశారు. విశాఖ జిల్లా నుంచి బదిలీ అయిన 22 మంది ఎంపీడీవోలను మంగళవారం ఆయన రిలీవ్ చేసిన సంగతి తెలిసిందే. 18 మంది ఎంపీడీవోలను తూర్పుగోదావరి జిల్లాకు, ఇద్దరిని శ్రీకాకుళం జిల్లాకు, ఇద్దరిని విజయనగరం జిల్లాకు బదిలీలు చేశారు. ఆ జిల్లాల నుంచి వచ్చిన వారికి పోస్టింగులు ఇస్తున్నారు. తొలుత విజయనగరం జిల్లా రామభద్రపురం ఎంపీడీవో కె.రమామణికి చోడవరం ఎంపీడీవోగా పోస్టింగ్ కల్పించి, ఉత్తర్వులు అందజేశారు. డిప్యూటీ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంత్‌ది హత్యే!?

- మృతుడి తల్లి, బంధువుల ఆరోపణ
- పోలీసులు న్యాయం చేయాలని డిమాండ్
- రోడ్డెక్కిన మృతుడి బంధువులు, గ్రామస్తులు
- అనకాపల్లి డీఎస్పీ రాకతో ఆందోళన విరమణ



కొత్తూరు జంక్షన్‌లో మానవహారం చేపట్టిన ఆందోళనకారులు



చోడవరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడు ప్రశాంత్ బంధువులు, గ్రామస్తులు

చోడవరం రూరల్: గత నెల 11న స్థానిక డిగ్రీ కళాశాల వెనుకవైపునున్న ఒక ప్రైవేటు భవనం కిటికీ ఇనుప గ్రిల్‌కు వేలాడుతూ విగతజీవిగా మారిన పత్తి ప్రశాంత్(24)ది ఆత్మహత్య కాదు.. హత్యేనంటూ మృతుడి తల్లి, బంధువులు, గ్రామస్తులు రోడ్డెక్కారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మృతుడి తల్లి పత్తి పార్వతి, ఇతర బంధువులు, గ్రామ పెద్దలు వైస్ ఎంపీపీ భర్త దొండా నారాయణమూర్తి, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, శ్రీరామ్మూర్తిల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు బుధవారం చోడవరానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. ముందుగా కొత్తూరు జంక్షన్‌లో మానవ హారం ఏర్పాటు చేసి రాస్తారోకో జరిపారు. ప్రశాంత్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలంటూ నినదించారు. అతడి మృతిని ఆత్మహత్యగా చూపాలని చూస్తున్నారని, ప్రేమ వ్యవహారం కారణంగా ప్రశాంత్‌ను బలిగొన్నారని, దీనికి బాధ్యులను తప్పక శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి చోడవరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ధర్నా చేశారు. చోడవరం పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సంఘటనా స్థలంలో మృతదేహం వేలాడుతున్న తీరును గమనించకుండానే ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ నిర్ణయానికి వచ్చేశారని దుయ్యబట్టారు. ఈ సంగతి తెలుసుకున్న సంఘటనా స్థలిలో ఉన్న అంకుపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు సైతం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు.

ప్రేమవ్యవహారమే బలిగొంది!

ప్రశాంత్‌ను అతడు మృతిచెంది ఉన్న ప్రైవేటు భవనంలో అద్దెకు ఉంటున్న కుటుంబానికి చెందిన యువతి ప్రేమించిందని, వీరిద్దరూ కలిసి దిగిన ఫొటోలు సైతం ఉన్నాయని, ప్రేమవ్యవహారం యువతి కుటుంబీకులకు ఇష్టం లేకే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. జనవరి 10న రాత్రి సమయంలో అనకాపల్లి మార్కెట్‌కు వెళ్లి వచ్చిన మీదట ప్రశాంత్ తన తల్లికి ఫోన్ చేసి ఆలస్యం అయినందున చోడవరంలో ఉండిపోతున్నట్టు, ఉదయం వస్తానని చెప్పిన వాడు తెల్లవారే సరికి మృతి చెందడంపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు.

పోస్ట్‌మార్టం నివేదిక మేరకే దర్యాప్తు..

చోడవరం పోలీస్ స్టేషన్ ఎదుట వడ్డాది గ్రామస్తులు ఆందోళన చేపట్టిన విషయం తెలుసుకున్న అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మృతుడి తల్లి పత్తి పార్వతి, వడ్డాది గ్రామ పెద్దలు నారాయణమూర్తి, చినవెంకయ్యదొర, శ్రీరామ్మూర్తి, అంకుపాలెం సర్పంచ్ రాంబాబులతో ఆయన చర్చించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఫిబ్రవరి 23వ తేదీ లేదా అటు తర్వాతనే తమకు అందుతుందని అంత వరకు తాము చేసేదేమీ లేదన్నారు. ఆ నివేదిక ప్రకారం కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆదేశంతో పాటు సీఐ బి.శ్రీనివాసరావు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

హోమియోతో ప్రమాదకర వ్యాధుల నివారణ



రామ్మోహనరావును సత్కరిస్తున్న పరిషత్ సభ్యులు

అనకాపల్లి: హోమియో వైద్యం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను నివారించవచ్చని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంతి లెక్చరర్ కొయిలాడ రామ్మోహనరావు అన్నారు. స్థానిక కోటపర్తి అప్పారావు ఉపాధ్యాయ భవనంలో బుధవారం భారతి వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లోపతి వైద్యం కన్నా హోమియో వైద్యం కాస్త ఆలస్యంగా పని చేస్తుందని చెప్పారు. హోమియో వైద్యంతో క్యాన్సర్ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. అంతకు ముందు రామ్మోహనరావును పరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు ఎ.ఓంరాం, బీవీవీ వర్మ, బుద్ధ అప్పారావు, కె.రమణ అప్పారావు, వి.ఈశ్వరరావు, ఏవీ బ్రహ్మానందం, కాండ్రేగుల అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డు లక్ష్మీనారాయణనగర్ విద్యుత్ ఫీడర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో లక్ష్మీనారాయణనగర్, కోట్నివీధి, మళ్లవీధి, గాంధీబొమ్మ సెంటర్, చిన్నవీధి, పప్పులవీధి, భీమునిగుమ్మం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

జూనియర్ కళాశాల వార్షికోత్సవ సందడి



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

గొలుగొండ: కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కాలేజీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో సుమారుగా 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాల యాజమాన్యం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు క్రీడలు, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 7105 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,540	4,790
మొదటి రకం	3,610	4,010
రెండో రకం	3,570	3,760
మూడోరకం	3,290	3,560

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
ఫైటర్	: సత్యనారాయణస్క్రీన్-1
బిఫోర్‌మ్యారేజ్ రామ్	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
సైంధవ్	: పర్తిసాయి
హనుమాన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-34 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 262 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 211 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

తేగాడలో అభివృద్ధి పరవళ్లు



తేగాడలో నిర్మించిన సచివాలయ భవనం

సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు
ఇంటింటికీ కుళాయిలు
వీధుల్లో సిమెంటు రోడ్లు
గ్రామస్తుల హర్షాతిరేకాలు



నాడు-నేడులో అభివృద్ధి చేసిన ఆదర్శ పాఠశాల



రైతు భరోసా కేంద్ర భవనం

కశింకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మారుమూల గ్రామాలు సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంతగానో అభివృద్ధి చెందాయి. ఇందుకు తేగాడ సచివాలయ పరిధిలోని తేగాడ, పేరంటాలపాలెం, శివారు జోగారావుపేట గ్రామాల్లో జరిగిన అభివృద్ధే నిదర్శనం. ఇక్కడ సుమారు రూ.3.85 కోట్ల నిధులతో అభివృద్ధి జరగ్గా, మరికొన్ని పనులు జరుగుతున్నాయి.

ఒకే ప్రాంగణంలో కార్యాలయాలు

సచివాలయ పరిధిలోని గ్రామాల్లో 3 వేలకు పైగా జనాభా ఉన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో తేగాడలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీనికి రూ.25 లక్షలు వెచ్చించి పంచాయతీ కార్యాలయం పై సచివాలయ భవనాన్ని నిర్మించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం కశింకోట, అనకాపల్లి వంటి ప్రాంతాలకు ప్రజలు ఇబ్బంది పడి వెళ్లే అవసరం లేకుండా వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, దానికి రూ.20.80 లక్షలతో సొంత భవనాన్ని నిర్మించి, వైద్య సేవలందిస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి, పంటల సాగుకు వ్యవసాయ సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి రూ.23.94 లక్షలతో సొంత భవనాన్ని నిర్మించి సేవలందిస్తున్నారు. ఒకే ప్రాంగణంలో ఈ భవనాలు ఉండటం వల్ల ప్రజలు, రైతులు అందుబాటులో ఒకేచోట ప్రభుత్వ సేవలు పొందడానికి అవకాశం కలుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు

రూ.25.3 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో తేగాడ గ్రామంలో ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చి తాగునీటిని అందిస్తున్నారు.

విద్యాసంస్థల అభివృద్ధి

ఇక్కడ రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆదర్శ పాఠశాల/జూనియర్ కళాశాలను రూ.65.5 లక్షలతో నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేశారు. అలాగే కస్తూర్బాగాంధీ విద్యాలయం/జూనియర్ కళాశాలను రూ.41 లక్షలతో మొదటి విడతలో అభివృద్ధి చేయగా, రూ.44 లక్షలతో రెండో విడతలో అదనపు భవనాలను నిర్మిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలను రూ.24.5 లక్షలతో అభివృద్ధి చేశారు. రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.15 లక్షలతో డ్రైనేజీ నిర్మించారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి

సచివాలయ పరిధిలోని పేరంటాలపాలెంలో రూ.30 లక్షలతో రోడ్లు నిర్మించారు.

జలజీవన్ మిషన్‌లో ఇదే గ్రామంతో పాటు శివారు జోగారావుపేటలో కలిపి 444 ఇంటింటి కుళాయిలు ఇచ్చి తాగునీటిని అందిస్తున్నారు.

- జోగారావుపేటలో నాడు-నేడులో ప్రాథమిక పాఠశాలను రూ.24.5 లక్షలతో అభివృద్ధి చేశారు. రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తున్నారు. ఇలా గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా గృహ నిర్మాణాలు

తేగాడలో స్థలం ఎక్కువగా ఉండటంతో కశింకోట తర్వాత పెద్ద జగనన్న గృహ నిర్మాణ లే అవుట్‌ను ఏర్పాటు చేసి 178 మందికి స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశారు. తేగాడతో పాటు చుట్టు పక్కల ఉన్న పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, జోగారావుపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులందరికీ ఇక్కడే స్థలాలను సమకూర్చారు. ఒక్కొక్క ఇంటికి రూ.లక్షా 80 వేల వంతున నగదు, మెటీరియల్ రూపంలో సహాయాన్ని ప్రభుత్వం అందించింది. దీంతో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇప్పటికే సగం మేర ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. వీటిలో చాలావరకు గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. వీటికి విద్యుత్, తాగునీటి సదుపాయం కూడా కల్పించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ప్రత్యేకంగా తాగునీటి కోసం 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నారు. తుది దశ నిర్మాణంలో ఉంది.



తేగాడ సచివాలయ భవనం	రూ.25 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23.94
వెల్‌నెస్ సెంటర్ భవనం	రూ.20.80
ఇంటింటి కుళాయిలు	రూ.25.80 లక్షలు
సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం	రూ.35 లక్షలు
నాడు-నేడులో ఆదర్శ పాఠశాల అభివృద్ధి	రూ.65.05 లక్షలు
నాడు-నేడు రెండు విడతల్లో కస్తూర్బాగాంధీ విద్యాలయం అభివృద్ధి	రూ.85 లక్షలు
ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి	రూ.24.50 లక్షలు
పేరంటాలపాలెం పంచాయతీలో రోడ్ల నిర్మాణం	రూ.30 లక్షలు
డిజిటల్ లైబ్రరీ నిర్మాణం	రూ.16 లక్షలు
నాడు-నేడులో జోగారావుపేట పాఠశాల అభివృద్ధి	రూ.24.5 లక్షలు
ఇంటింటి కుళాయిలు	రూ.10 లక్షలు

మా గ్రామం స్వరూపమే మారిపోయింది



మా ఊరిలో గతంలో పంచాయతీ కార్యాలయం మాత్రమే ఉండేది. దీంతో ప్రభుత్వ సేవలు పొందాలన్నా, ఆస్పత్రికి వెళ్లాలన్నా కశింకోటకు వెళ్లేవాళ్లం. వైఎస్సార్‌సీపీ పాలనలో మా ఊరికే సచివాలయం వచ్చింది. అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, సర్టిఫికెట్లు ఇక్కడే తీసుకుంటున్నాం. వెల్‌నెస్ సెంటర్‌తో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం కశింకోట వెళ్లేవాళ్లం.. ఇప్పుడు రైతుభరోసా కేంద్రం ఏర్పాటుతో ఆ ఇబ్బంది తప్పింది. గతంలో వీధి కుళాయిల నుంచి సరిగ్గా నీరు రాక చాలాసేపు నిలబడి ఉండిపోయేవాళ్లం. ఇప్పుడు ఇంటింటికీ కుళాయిలు వచ్చేశాయి. మా ఊళ్లో సిమెంటు రోడ్లు కూడా వేశారు. మా గ్రామం స్వరూపమే మార్చేశారు. ఎంతో ఆనందంగా ఉంది.

– నీటిపల్లి రాజారావు, వ్యవసాయదారుడు, తేగాడ

సొంతింటి కల నెరవేరింది



మాది పేద కుటుంబం. నా భర్త సత్యారావు కూలిపని చేసేవారు. మాకు సొంతిల్లు లేదు. తేగాడలోని జగనన్న లే అవుట్‌లో స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నాం. అక్కడే నివాసం ఉంటున్నాం. సొంతింటి కల నెరవేరినందుకు ఎంతో ఆనందంగా ఉంది. స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకోవడానికి సహాయం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పెయ్యల నాగ వరహాలు, కొత్తపల్లి

మా బడి ఎంతో బాగుంది



నేను ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాను. నాడు-నేడులో మా బడిని బాగు చేసి, అందంగా తీర్చిదిద్దారు. సదుపాయాలు మెరుగుపరిచారు. ఇప్పుడు మా బడి ఎంతో బాగుంది. రోజూ పాఠశాలకు వెళ్లి ఆనందంగా చదువుకుంటున్నా.

– చందక పూర్ణచంద్, ఆదర్శ పాఠశాల విద్యార్థి, తేగాడ

సీఐపీఈటీ నూతన బ్యాచ్ ప్రారంభం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ (సీఐపీఈటీ) ఆధ్వర్యంలో విజయవాడలో మెషిన్ ఆపరేటర్-ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో అవుట్ గోయింగ్ బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ సింగ్ సిన్హా ప్రారంభించారు. లబ్ధిదారులకు శిక్షణ కిట్లు, స్టైఫండ్ అందజేశారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ సంస్థ అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీవితాలకు, వృత్తికి బలమైన పునాదులు వేస్తూ ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ శేఖర్, సీఎస్సార్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



నూతన బ్యాచ్‌తో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె. సిన్హా

యువకుడి ఆత్మహత్య



మృతుడు తేజ

అనకాపల్లి: అనకాపల్లి లక్ష్మీదేవిపేటలో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొణతాల తేజ(23) అనే యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరిచి చూడగా తేజ ఉరిపోసుకుని కనిపించాడు. అనుమానాస్పద మృతిగా పేర్కొంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ జి.శంకరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి పెళ్లి కాలేదు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనపై విచారణ జరుపుతున్న సీఐ శంకరరావు

ఘనంగా మహాత్మా గాంధీ తీర్థం



కె.జె.పురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ రమణబాబు తదితరులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో బుధవారం మహాత్మా గాంధీ తీర్థం ఘనంగా నిర్వహించారు. గాంధీ వీధిలోని జాతిపిత విగ్రహానికి గాంధీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దాడి రాము ఆధ్వర్యంలో సర్పంచ్ జామి రమణబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ త్యాగనిరతిని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాళ్ల అప్పలనాయుడు, దాడి రాము, విశ్రాంతి ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లి నాయుడు వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు సైకిల్ స్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు మాలినాయుడు, మళ్ల కన్నబాబు, బి.జగ్గారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆదారి వెంకట సూరిప్పారావు, ఆదారి శంకర్, స్థానికులు కె.రఘు, ఎం.వి.సత్యనారాయణ, కె.పి.ఎ.సత్యనారాయణ, ముచ్చకర్ల శ్రీను, బుడబండి రాజు, మాటూరి అప్పారావు, గణేశ్, పి.అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

కాలువ పనులకు నేడు శ్రీకారం

కశింకోట: స్థానిక దాడి వారి వీధిలో కాలువ నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే గోవిందరావు కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ క్రాప్ నమోదు చేస్తేనే ప్రభుత్వ రాయితీలు

మాడుగుల: రబీ పంటలకు సంబంధించి సకాలంలో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, దానితోనే ప్రభుత్వ రాయితీలు ముడిపడి ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. మాడుగుల, కేజేపురం గ్రామాల్లో ఈక్రాప్ నమోదు జరుగుతున్న తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 15తో రబీ పంట కాలానికి ఈ క్రాప్ నమోదు గడువు పూర్తవుతుందన్నారు. ప్రభుత్వం రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందజేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే ఆ పరిహారం రైతులకు అందజేయాలన్నా, పండిన పంటలు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. పంట పొలాల్లో తిరిగి ఈ క్రాప్ నమోదు ఉపయోగాలు, పెసర, మినప పంటలకు సోకే తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు. అనంతరం మాడుగుల అగ్రీ ల్యాబ్ పరిశీలించారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసుల కుటుంబ సభ్యులతో ఎస్పీ మురళీకృష్ణ, అధికారులు

అనకాపల్లి: ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు శేషజీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన స్పెషల్ బ్రాంచి ఎస్ఐ బి.ఆదినారాయణరెడ్డి, కానిస్టేబుల్ పి.వి.రమణమూర్తి దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన అవసరమొచ్చినా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ్‌భాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారదా, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, రామకృష్ణారావు, సతీష్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదల ఆరోగ్యానికి ధీమా



నేత్ర పరీక్షను పరిశీలిస్తున్న సునీత, జానకీరామరాజు



శిబిరానికి హాజరైన వార్డు ప్రజలు

అనకాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికి ఆదర్శమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. విజయరామరాజుపేట 3వ సచివాలయంలో బుధవారం జరిగిన మలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణతో పేదలకు ఆరోగ్య ధీమా కలిగిందన్నారు. సచివాలయం పరిధిలో పేదలకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసే దిశగా తమ చల్లని ఆశీస్సులు అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం జగన్ ఆశయమన్నారు. అంతకు ముందు జెడ్సీ ఎస్.వెంకటరమణతో కలిసి వారు వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. వార్డు పరిధిలో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయని, తక్షణమే తొలగించాలని జెడ్సీని సునీత కోరారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య వాహనాల ద్వారా చెత్తను తరలించి, పరిశుభ్రమైన వాతావరణానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలకా సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లు త్రినాథ్, కోన ఉమ, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

అధికారులకు ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి ఆదేశం

పరవాడ: మండల సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు మాట్లాడుతూ సభ్యులు ప్రశ్నలు సూటిగా అడిగి అధికారుల నుంచి సమాధానాలు రాబట్టాలని సూచించారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలపై మరోసారి ఆయా కార్యాలయాల్లో అధికారులను కలిసి వివరించడం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే వీలు కలుగుతుందన్నారు.

పాడిరైతులకు రుణాలు

మండలంలోని 120 మంది రైతులకు పాడి పశువుల కొనుగోలుకు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ (పీఎంఈజీపీ) ద్వారా రాయితీతో కూడిన దీర్ఘకాలిక బ్యాంకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. ఈ పథకంలో రైతు రెండు పాడి పశువులను ఒకే సారి కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పశువుల కొనుగోలుకు మంజూరు చేసిన రుణంలో 35 శాతం రాయతీ లభిస్తుందన్నారు. రెండు పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షలు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందని చెప్పారు. రుణం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఏవో చంద్రావతి కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు సభ్యులు లేవనెత్తిన ముఖ్యమైన అంశాలు

- హిందూజా పవర్ ప్లాంటు సీఎస్సార్ నిధులను మండలంలోని రహదారుల మరమ్మతులకు కేటాయించే విధంగా తీర్మానం చేయాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు. సీఎస్సార్ నిధుల కోసం రోడ్లు భవనాల శాఖ కూడా తమ ఉన్నతాధికారుల ద్వారా పవర్ ప్లాంటు యాజమాన్యానికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని కోరారు.
- 90 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ అప్పలనాయుడు హౌసింగ్ అధికారులను కోరారు.
- మండల సర్వేయర్ కొంత కాలంగా అందుబాటులో లేకపోవడంతో భూసర్వే పనులు నిలిచిపోయాయని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు అన్నారు. సమస్యను అధికారులకు నివేదిస్తామని సీనియర్ అసిస్టెంట్ రమణ వివరణ ఇచ్చారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

'పాడి రైతులకు వడ్డీలేని రుణాలు'



పాడి రైతులకు దుప్పట్లు అందజేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు

కశింకోట: పాడి పశువుల కొనుగోలుకు విశాఖ డెయిరీ వడ్డీ లేని రుణాలు అందిస్తుందని డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం, గొబ్బూరు, అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో 256 మంది పాడి రైతులకు ప్రోత్సాహకంగా విశాఖ డెయిరీ సమకూర్చిన దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాడి ఆవులను కొనుగోలు చేసుకొని డెయిరీకి పాలు ఎక్కువగా ఇచ్చి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ యలమంచిలి యూనిట్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, పాల సంఘాల అధ్యక్షులు పప్పల అప్పారావు, గుమ్మడి నారాయణరావు, పీఎస్ రామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.